# కాపలా

''కిరణ్.. కొంచెంసేపు ఆగరా... అక్క కూడా వస్తుంది. కలిసి వెళ్లండి''. పవిత్రకి జడవేస్తోన్న సుభద్ర బ్రతిమాలుతున్న స్వరంతో అంది.

కిరణ్ బ్యాగ్ భుజానికి తగిలించుకుని నిగనిగలాడే నల్లని బూట్లు తొడుక్కుని, ''అవెమ్మా! నాకాలస్యం అయిపోతుంది. నేనుండను'' అంటూగుమ్మం దగ్గరికి నడిచాడు.

''నా తండ్రి కదూ! ఐదు నిమిషాలగరా! ఈ ఒక్క జడవేసేస్తాను''. ఒక జడ అల్లడం పూర్తి చేసి, రెండో జడ అల్లుతూ అన్నది.

''అక్క కోసం రోజూ నేనిలా ఎదురు చూస్తూ కూర్చుంటే నాకాలస్యం అయిపోతుంది తెలుసా? తనొక్కతే వెళ్లచ్చుగా''

''అక్క ఆడపిల్లకదరా! నువ్వేమో మగాడివి. దానికి తోడుగా ఉండి, జాగ్రత్తగా తీసికెళ్ళి తీసుకురావాలి... ''నచ్చచెప్పుతున్నట్లుగా అన్నది ఆవిడ.

'' ఏం? నాకన్నా పెద్దదేగా! నేనెందుకు తోడు?''

''అక్కని దారిలో ఎవరూ ఏమీ అనకుండా, అల్లరి పెట్టకుండా నువ్వు కాపలా అన్నమాట.'' రెండో జడ కూడా పూర్తి చేసి, ' ఇంక వెళ్లవే.. పుస్తకాలు తీసుకో - ఇదిగో టిఫిను బాక్స్''.. అంటూ హడావుడి చేసింది.

''వాణ్నివెళ్లనీమ్మా.. నాకేం భయంలేదు. నేనొక్కదాన్ని వెళ్లగలను. ఆకలేస్తోంది. అన్నం తినివెళ్తానే.'' జాలిగా అన్నది పవిత్ర. కానీ, సుభద్ర అదేం పట్టించుకోలేదు. అన్నం తింటే ఆలస్యం అవుతుంది... కిరణ్ వెళ్ళిపోతాడని, పవిత్రని తొందర పెట్టింది.

పవిత్ర నిస్సహాయంగా కిరణ్‌ని అనుసరించింది.

'' ఈ వేలెడు వెధవ తనకి కాపలానా? తనొక్కతే వెళ్లగలదు. తనకసలు భయంలేదు, ఉత్తినే అమ్మా-నాన్న నాన్నమ్మా ఖంగారు పడతారు. నాన్నమ్మ

మరీనూ...''

'' ఆడపిల్ల నొక్కదాన్నే బైటికి పంపించకండర్రా'' అంటూ ప్రతి రోజూ గోల.

ఆ మధ్య పెద్దమ్మ కూతురు పెళ్లయితే కూడా అంతే.

అమ్మా, నాన్న, నాన్నమ్మా పెళ్లికి అమలాపురం వెళుతూ, తననీ --- కిరణ్‌ వదిలేశారు. కిరణ్ ఎంచక్కా స్నేహితులతో ఆడుకోడానికి వెళ్తే తనేమో వంటావిడ దగ్గర కూర్చోవాల్సి వచ్చింది... తనకి వంటావిడ కాపలాట.

తన స్నేహితురాలు లీల పుట్టినరోజు పండగైతే కిరణ్ తోడుగా రానన్నాడని... ఒక్కదాన్నీ వెళ్తానన్నా వెళ్లనీలేదు.

అసలైనా వీడేదో పెద్ద మగాడిలా తనకి కాపలా ఏమిటి అనుక్షణం.

ఉక్రోషం ముంచుకొచ్చింది పవిత్రకి

'' ఓ తల్లీ! గబగబా నడుస్తావా? టైమైపోయింది'' ముందు వెళ్తోన్న కిరణ్‌ ఆగి వెనక్కి తిరిగి అన్నాడు. ''వస్తున్నాలే నువ్వు పద---'' ఆలోచనల నుంచి తెప్పరిల్లిన పవిత్ర చకచకా నడవడం మొదలుపెట్టింది.

కాలం కూడా చకచకా నడిచింది. మూడేళ్లు గడిచాయి. కిరణ్ కాపలాగా--- పవిత్ర స్కూల్ ఫైనల్ పాసైంది.

నాన్నమ్మ చదువు మాన్పించేయమని పోరు. నాన్నకి తల్లిమాట వేదవాక్కు... సుభద్రకి భర్త మాట శిలాశాసనం -- ఫలితంగా పవిత్ర ఇంట్లో ఉండిపోయి కుట్లూ, అల్లికలూ నేర్చుకోవాల్సి వచ్చింది.

తండ్రి సంబంధాల వేటలో పడ్డాడు. ఏడాది తరువాత సంబంధం నిశ్చయం అయింది.

గుంటూరులో పంచాయతీరాజ్‌లో పనిచేస్తోన్న కృష్ణమూర్తి వరుడు. ఇద్దరు మరదులు, ఇద్దరాడపడుచులు, అత్తగారు, మావగారు -- ఆపెద్ద కుటుంబానికి పెద్ద కోడలైంది చిన్నారి పవిత్ర.

పవిత్ర జీవితంలో రెండోదశ ప్రారంభమైంది. భీమవరం వదిలి--- మొదటిసారిగా, భర్త చేయి పట్టుకుని గుంటూరు ప్రయాణమైంది.

కానీ, ఆమె ఆనందం ఆవిరవడానికి రెండ్రోజులు పట్టింది. ఆ ఇంట్లో స్వేచ్ఛ అందరికీ ఉంది-- కానీ తనకి మాత్రం లేదని గ్రహించాక తన మీద తనకే జాలేసింది.

కృష్ణమూర్తికి గొప్ప అనుమానం భార్య మీద - పరాయి మగాడితో మాట్లాడుతుందేమో అని--

అత్తగార్కి ఇంకా అనుమానం కోడలి మీద తాను చెప్పినమాట వినదేమో అని.

ఆడబడుచులకి అన్నయ్య-- తమకి ఇవ్వకుండా, వదినగార్కి కానుకలేమైనా ఇస్తున్నాడేమో అని అనుమానం.

మరుదులకి-- అన్నగారు, భార్యా విధేయుడవుతాడా అని అనుమానం -- మొత్తానికి అందరూ ఏదో ఒక అనుమానంతో పవిత్రని అనుక్షణం కాపలా కాస్తూ ఉండే వాళ్ళు--

పవిత్ర కొత్తల్లో నాలుగు నెలలకోసారి భర్తతో కలిసి పుట్టింటికెళ్ళి, మళ్ళీ అతనితోటే తిరిగి వస్తుండేది -- రాను రానూ-- ఏడాదికోసారి వెళ్ళడం --- అదీ భర్తతోటే -- నాలుగేళ్ళు గిర్రున తిరిగాయి.

పవిత్ర తమ్ముడు కిరణ్‌కి స్టేట్ బ్యాంక్‌లో ఉద్యోగం వచ్చింది--- పోస్టింగ్ విజయవాడ ఇచ్చారు. మరుదులిద్దరికీ ఉద్యోగాలు దొరికి ఒకరు నాగపూర్, ఒకరు పూనా వెళ్ళిపోయారు. పెద్దాడబడుచు పెళ్ళైంది. కృష్ణమూర్తికి హైదరాబాద్ ట్రాన్స్‌ఫర్ అయింది. అత్తగారు తోడు రాగా, భర్తతో కలిసి హైదరాబాద్ ప్రయాణమైంది పవిత్ర.

రెండు గదులున్న చిన్న పోర్షన్‌లో వాళ్ల కాపురం మొదలైంది. అత్తగారు కొన్ని రోజులు ఉండి వెళ్లిపోయింది. గుంటూరులో స్వంత ఇల్లు -- అది వదిలి ఎక్కడా ఉండడం ఇష్టం లేదు మావగార్కి.

అత్తగారు వెళ్ళిపోయాక పవిత్రని ఇంట్లో ఒక్కదాన్నీ ఉంచడం ఇష్టంలేక కృష్ణమూర్తి, పక్కింటి పిన్నిగార్ని పవిత్రకి కాపలాగా ఉంచి ఆఫీసుకి వెళ్తుండసాగాడు. పవిత్రకి తనకి పిల్లలు లేరన్న దిగులు ఆవరించింది. పిల్లలుంటే కాస్త ఈ ఒంటరితనం పోతుందేమో అనిపించింది.

ఎంతమంది తన చుట్టూ ఉన్నా ఎన్ని కళ్ళు తనని పహారా కాసినా - తనవాడు - భర్తపక్కనే ఉన్నా తను ఒంటరిదాన్నన్న దిగులు - బాధ అనుక్షణం పవిత్ర మనసును తొలిచేయసాగాయి.

పవిత్ర బాధ అర్థం చేసుకున్నవాడిలా దైవం కరుణించాడు. ఓ శుభ ముహూర్తంలో తను తల్లి కాబోతున్నానన్న సంగతి తెలుసుకుంది. ఆమె ఆనందానికి అవధుల్లేవు - తన ఆనందం భర్తకి పంచుతూ మురిపెంగా అడిగింది. 'మీకు ఆడపిల్ల కావాలా? - మగపిల్లాడా?''

''ఛీ - ఛీ ఆడపిల్లలెందుకు? వంశోద్ధారకుడు - నాకు కొడుకే కావాలి - ఆడపిల్ల పుట్టిందగ్గర్నించీ దాన్ని అనుక్షణం కాపలా కాస్తూ కూర్చోవాలి.'' అన్నాడు కృష్ణమూర్తి కరుగ్గా.

పవిత్ర మనసు చివుక్కుమంది. '' ఆడపిల్ల అంటే ఎందుకలా చులకనగా మాట్లాడుతున్నారు? ఈ రోజుల్లో ఆడా, మగా తేడా లేకుండా అందరూ అన్ని పనులూ చేస్తున్నారు కదా! -- సమానంగా చదువుకుంటున్నారు కదా!'' అన్నది.

'' ఆ -- ఆ చేస్తారు -- చేయకేం -- ఆడాళ్ళు బరితెగించి పోతున్నారు - ఈ వెధవాలోచనలు మానెయ్ - నాకు మాత్రం మగపిల్లాడే కావాలి.'' అన్నాడు.

పవిత్ర నిట్టూర్చింది.

కృష్ణమూర్తి కోరిక నెరవేరి - రెండు కాన్పుల్లోనూ మగ పిల్లలే పుట్టారు.

ఆడపిల్ల కావాలన్న పవిత్ర కోరికను సమాధి చేస్తూ, ఆపరేషన్ చేయించేశాడు కృష్ణమూర్తి.

కనీసం ఆ ఇద్దరు మగపిల్లలని తన అభిరుచుల మేరకు పెంచుకోవాలనుకుంది పవిత్ర.

కానీ ఆ కోరిక కూడా తీరలేదు. పెద్దవాడు ప్రసాద్, చిన్నవాడు కాళీచరణ్ ఇద్దరూ కూడా మమ్మూర్తులా తండ్రి పోలికలు - గుణాలు పుణికి పుచ్చుకున్నారు.

పవిత్రకి ఇంక జీవితం పట్ల ఆసక్తి - ఆశ నశించిపోయాయి. కాలం

ఎలా కదిలిస్తే అలా కదిలిపోతూ ఆమె యవ్వనం కరిగిపోయింది.

నాన్నమ్మ, తండ్రి, అత్తగారు కాలగర్భంలో కలిసిపోయారు. ఆడపిల్లలు అత్తగారిళ్ళకి - మగపిల్లలు ఉద్యోగాలపేరుతో మరో ఊరికి వెళ్లిపోవడంతో - ఒంటరివాడైన మావగారు పవిత్ర దగ్గరికి వచ్చేశాడు. ఆయన ఆలనా, పాలనా, వేళకి టిఫిన్లు, కాఫీలు, భోజనం మందులూ, అన్ని రకాల సంరక్షణ భారం పవిత్ర పైనే పడింది. ఇప్పుడు పవిత్ర ఆ వృద్ధుడికి కాపలాగా ఉండిపోయింది. పిల్లలు పెద్దవాళ్ళయ్యారు. ప్రసాద్ సివిల్ ఇంజనీరు - కాళీచరణ్ మెకానికల్ ఇంజనీరింగు అయ్యారు.

కృష్ణమూర్తికి హోదా - సంపాదనా పెరిగింది - వాటితోపాటు అహం కూడా పెరిగింది. పవిత్ర దినచర్య యాంత్రికం అయిపోయింది. చిన్న చిన్న కోరికలు, ఆశలు అడుగంటిపోయాయి. సున్నితమైన ఆ లేత హృదయం బండబారిపోయింది. తను చూడలేని - హాయిగా, స్వేచ్ఛగా తిరగలేని ఓ విశాల ప్రపంచాన్ని - కిటికీలోంచి చూడడానికి విశ్వప్రయత్నం చేస్తుండేది. ఆకాశంలో సాగిపోతోన్న విమానాలను దగ్గరగా చూడాలని, పిల్లలు చెప్పుకుంటున్న వింతలెన్నో కనులారా వీక్షించాలనీ - అనిపిస్తుండేది - మ్యూజియంలో పురాతన కాలంనాటి వస్తువులున్నాయట - ఎలా ఉంటాయో! అనుకునేది.

డబుల్ డెక్కర్ బస్‌లో ఎక్కడికో ట్యాంక్ బండ్‌ట - అక్కడి నుంచి వెళ్తోంటే, చాలా బాగుంటుందని పక్కింటి విశాలాక్షి చెప్పింది. ఆ బస్సులో ఒక్కసారి ఎక్కాలని ఉంది. కానీ ఎలా? తనకెలా వెళ్లాలో - ఎక్కడి వెళ్లాలో తెలీదు. ఎవరన్నా తోడుగా తనని తీసికెళ్ళాలి - ఎవరూ తీసికెళ్ళరు.

ఒంటరిగా వెళ్ళనివ్వరు

నిట్టూర్చింది పవిత్ర

గుంటూరులో ఉన్న ఇల్లు అమ్మేసి ముగ్గురు అన్నదమ్ములూ వాటాలు పంచుకున్నారు. తమ వంతు వాటాకి మరికొంత కలిసి - ఊరికి దూరంగా చిన్న ఇల్లు కొన్నాడు కృష్ణమూర్తి. పవిత్రకి సంతోషం కలిగించిన విషయం అదొక్కటే - ఆ చిన్న మచ్చటైన ఇల్లు చూసి మురిసిపోయింది. పెరట్లో అనేక రకాల మొక్కలు నాటి వాటిని ప్రాణంగా చూసుకుంటూ - తన వంటరి

తనాన్ని మరచి పోయింది. సృష్టిలో తను చూడలేని అందాలెన్నో ఆ పెరట్లో చూసుకుని పొంగిపోయింది:

కొడుకుల పెళ్ళిళ్ళు జరిగాయి. కోడళ్ళిద్దరూ ఉద్యోగస్థులే - కాల చక్రంలో మరో ఏడాది గడిచింది.

మావగారు గతించారు.

ఇప్పుడు కొడుకులూ, కోడళ్ళూ ఉద్యోగాల కెళ్తూంటే వాళ్లకి వండి వార్చడం – వేళకి టిఫెను క్యారేజీలు సర్దడం – క్షణం తీరిక లేకుండా అయింది. పెద్ద కోడలికి పాప – చిన్న కోడలికి బాబు పుట్టారు. మనువడు మనవరాళ్ళను కాపలా కాయాల్సిన బాధ్యత పవిత్ర మీదే పడింది.

పాకుతున్న వాళ్ళిద్దరూ గడపదాటకుండా - తప్పటడుగులు వేస్తోన్న చిన్నారులు కాలు జారకుండా - స్కూల్ కెళ్ళడం ప్రారంభించాక వాళ్ళు తప్పిపోకుండా ఆవిడే అనుక్షణం వేయి కళ్ళతో కాపలాకాస్తోంది. ఓ దుర్మూహుర్తంలో కృష్ణమూర్తికి పక్షవాతం వచ్చి కాళ్ళూ, చేతులూ పడిపోయాయి. ఇప్పుడు భర్తని కనురెప్పకూడా వాల్చకుండా కాపాడవలిసిన బాధ్యత అదనంగా పెరిగింది.

కొడుకులూ, కోడళ్ళూ – లాంఛనంగా అప్పుడప్పుడు కృష్ణమూర్తిని పలకరిస్తుంటారు. చిన్న కోడలైతే సరేసరి – ఆయన మంచానపడిన దగ్గర్నుంచీ '' ఇంట్లో రోగిష్టివాళ్లున్నారు - బాబు ఆ ఇంట్లో ఉండడం వాడి ఆరోగ్యానికి మంచిది కాదని'' - వేరే వెళ్ళిపోదామని భర్త చెవిదగ్గర జోరీగలా రొదపెట్టసాగింది.

ఆఖరికి ఓ రోజున హఠాత్తుగా వేరే వెళ్ళిపోతున్నాం అని చెప్పి – ఇద్దరూ పిల్లాడ్ని తీసుకుని వెళ్ళిపోయారు. పవిత్ర భోరుమని ఏడ్చింది. అవసానదశలో ఉన్న తండ్రిని, ఇలా క్షోభ పెట్టద్దు అని వేడుకుంది. కానీ ఆవిడ వేడికోలుకు ఆ భార్యభర్తల మనసు కరగలేదు.

కృష్ణమూర్తి ఇదివరకులా లేడు. ఇప్పుడు భార్యతో ఎంతో ప్రేమగా మాట్లాడుతున్నాడు.

జీవితం ఎలాంటివాళ్ళని ఎలాగైనా మారుస్తుంది - కృష్ణమూర్తి

మానసికమైన, శారీరకమైన అనారోగ్యంతో త్వరలోనే కన్ను మూశాడు. పవిత్రకి లోకమంతా శూన్యంగా తోచింది: ఒంటరి తనం అనే ఓ ముళ్ళపంజరం ఎవరో మీట నొక్కి వదిలేసినట్లు - దగ్గరగా వచ్చి ఊచలు ఆవిడ గుండెల్లో గుచ్చుకుంటున్న ఆవేదనేదో ఆవిడ గుండెల్ని నొక్కేసింది.

కృష్ణమూర్తి పెన్షన్, పవిత్రకొచ్చే ఏర్పాట్లు చేశాడు ప్రసాద్. నెలనెలా ఆవిడ చేత ఏవో సంతకాలు చేయించుకుని వెళ్తుంటే కొన్నాళ్ళపాటు ఆ సంతకాలు దేనికో - తెలుసుకునే ప్రయత్నం చేయలేదావిడ - కానీ ఓసారెందుకో డబ్బు అవసరం అయి వేయి రూపాయలు బ్యాంక్ నుండి డ్రా చేసుకురమ్మని ప్రసాద్‌కు చెప్పింది.

''అంతెందుకు లేమ్మా - నీకేం ఖర్చులుంటాయి - హాయిగా ఈ ఇంట్లో సుఖంగా ఉంటూ - కడుపునిండా తిని హాయిగా నిద్రపో! మిగతా వ్యవహారాలు నేను చూసుకుంటున్నాగా'' అన్నాడు.

ఆవిడ హతాశురాలైంది. భర్త సంవత్సరీకాల సందర్భంగా అన్నదానం చేయించాలనుకుంది. ''తన డబ్బు ఉన్నప్పుడు కొడుకునెందుకులే అడగాలి అనుకున్నది.'' కానీ కొడుకుమాటలు వింటుంటే ఆ డబ్బు కైంకర్యం చేశాడన్న అనుమానం వస్తోంది - అయితే ఆవిడ ఏమి అనలేదు. మౌనంగా ఉండిపోయింది. కొడుకు దృష్టిలో తనకి తలదాచుకోడానికీ గూడు, కడుపునిండా తిండి కట్టుకోవడానికి బట్టలు ఉన్నాయి. అంతకన్నా ఏం కావాలి? అన్న ఆలోచన ఉంది.

అంతేలే - తన తండ్రి, మావగారు, భర్త ఈనాడు కొడుకులు - అందరి ఉద్దేశం ఒకటే కూడు, గుడ్డా, నీడా - ఇంతకన్నా ఆడదానికేం కావాలి? ఆడదానికీ మనసుందనీ, దానిక్కొన్ని ఆశలూ, కోరికలూ ఉన్నాయని ఎలా తెలుస్తుంది?

ఆవిడని ఒంటరితనం ఈ మధ్య మరీ బాధపెడుతోంది. మనవరాలు స్కూలుకెళ్ళుతోంది. ఇప్పుడు పగలంతా ఒక్కతే - ఏ కాపలా లేకుండా, తనెవరికీ కాపలా కాకుండా ఉంటోంది - కానీ ఈ ఒంటరితనం ఇప్పుడు భయపెడుతోంది - ఏ క్షణమైనా తనేదన్నా అయిపోవచ్చుననిపిస్తోంది. అప్పుడు - ఎవరూ దగ్గర లేకుండా - అనాధలా పోతుందేమోనన్న భయం - కనీసం

ఆ భయం పోగొట్టేందుకు - ఒకనాటి పిన్నిగారి తోడుకూడా లేదు - ఆవిడ కూడా పూర్వీకుల్లో కలిసిపోయింది. ఆవిడ కోడలు విశాలాక్షి పురిటికి పుట్టింటికి వెళ్ళింది.

ఎందుకో పవిత్రకి తల్లి గుర్తొచ్చింది. ఎలా ఉందో అమ్మ - తమ్ముడు బాగా చూసుకుంటున్నాడో లేదో? - అమ్మ దగ్గరికి వెళ్ళాలని ఉంది - బాగా ఏడుపొచ్చిందావిడకి - చాలాసేపు హృదయ విదారకంగా ఏడుస్తూ ఒక్కతి పడుకుంది. పవిత్రలో మునుపటి ఓపిక నశించింది. చాలా నీరసంగా, అలసటగా ఉంటోంది - లేస్తే కళ్ళు తిరుగుతున్నాయి.

అందరూ ఎవరిదారిన వాళ్ళు కాలేజీలకు, స్కూల్‌కి వెళ్ళిపోయాక ఆ ఇల్లు - ఇంట్లోని ప్రతి అణువూ ఆవిణ్ణి వెక్కిరిస్తున్నట్లనిపిస్తోంది - ''నీకు ధైర్యం - ఆత్మవిశ్వాసం - శక్తి ఉన్నప్పుడు - నీకు ఏకాంతం దక్కకుండా. నీ చుట్టూ ఎందరో కాపలాగా వుండేవాళ్ళు - కాపలా అవసరమైన ఈ వయసులో ఎవరూ లేరేం.'' అని ఆ ఇంట్లోని ప్రతి వస్తువూ అడుగుతున్నట్లనిపిస్తోంది.

పేలవంగా నవ్వుకుంది...

ఆవిడ అనారోగ్యం - అస్తమానం దగ్గడం పెద్ద కోడలికి చిరాకు తెప్పిస్తోంది - మనకెందుకీ తద్దినం - ఆవిణ్ణి ఏదన్నా ఓల్డ్‌ఏజ్‌హోమ్‌లో చేర్పించండి'' అన్నది భర్తతో.

''అమ్మ - ఓ బంగారు బాతు - ప్రస్తుతం - ఆవిణ్ణి పంపిస్తే మనమే నష్టపోతాం ఇక్కడైతే వేళకింత ఉడకేసి పెడితే చాలు - పెన్షన్ డబ్బు మనం వాడుకోవచ్చు'' అన్నాడు ప్రసాద్.

ఆ మాటలు - అప్రయత్నంగానే పవిత్ర చెవుల్లో పడ్డాయి. ఆవిడ గుండెల్ని కోసినట్టు అనిపించింది. '' ఎంత సహృదయుడివిరా ప్రసాద్! ఇంకా నామీద ప్రేమతో ఈ వయసులో నన్ను కాపాడుకుంటావనుకున్నాను - ఇదా నీ ఆలోచన!'' అనుకుంది.

''తరతరాలుగా ఎవరికీ లేని సంస్కారం నీకెక్కడి నుంచి వస్తుందిలే!'' అని సమాధానపడడానికి ప్రయత్నించింది.

బాధ్యతలు మీద పడతాయోమోనని పారిపోయిన చిన్నకొడుకూ,

కోడలూ... బాధ్యతలు మోయకుండా ఆర్థికలాభం కోసం ప్రేమ నటిస్తోన్న పెద్దకొడుకూ...

తన మీద అభిమానంతో -- ప్రేమతో - తన క్షేమంకోసం తపించే వాళ్ళెవరూలేరు -

అనారోగ్యంతో, వృద్ధాప్యంతో నిస్సహాయంగా మిగిలిపోయి, ఒంటరితనం వెక్కిరిస్తోంటే - తోడుకోసం తపిస్తోన్న ఈ సమయంలో తనకెవరూ కాపలాగా లేరు.

ఆరోజు ఆవిడకి పూర్తిగా ఓపిక నశించింది. నాల్రోజులుగా జ్వరం వస్తోంది. తిండి సయించడం లేదు.

డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళమని, కొడుకుని అడగాలనుకుంది. కానీ ఆత్మాభిమానం అడ్డం వచ్చింది.

దాహం వేస్తోంది... లేచి వంటగది దాకా నడిచే ఓపికాలేదు.

ఏదో బాధ - గుండెల్లో గూడుకట్టుకున్న బాధ - ఆకలి - దాహం - నీరసం - నిస్సహాయత గొంతులోంచి మాట పెగలడం లేదు - గట్టిగా ఎవర్నైనా పిలవాలంటే శక్తి చాలడంలేదు - సురేష్‌ని - సతీష్‌నీ చూడాలి - మనవరాలితో ఆడుకోవాలి - అమ్మని ఒక్కసారి - ఒక్కసారి చూడాలి - కిరణ్ ఎలా ఉన్నాడో! అమ్మని సరిగా చూసుకుంటున్నాడా? ''సతీష్!... గొంతు దాటి శబ్దం రాలేదు... గది గోడలు.. సీలింగ్ ఫ్యాన్ -- గదిలోని వస్తువులు తనవైపు జాలిగా చూస్తున్నాయి. నిశ్శబ్దం. నిశ్శబ్దం - నిశ్శబ్దం ఆవిడ గుండెని కోస్తోంది. ఇప్పుడు ఎవరన్నా కావాలి -- అదేవిటి! ఎవరూ లేరేం - స్కూల్‌కి ఒక్కదాన్నే వెళ్ళగలను! అంటే వీల్లేదని కిరణ్‌ని తోడుగా పంపిందమ్మ.

పెళ్ళయ్యాక పుట్టింటికి ఒక్కదాన్నే వెళ్ళగలను అంటే - తల్లిని తోడుగా పంపాడు భర్త...

ఇంట్లో ఆయన లేకపోయినా, వంటరిగా ఉండడానికి భయం లేదంటే, వీల్లేదంటూ పక్కింటి పిన్నిగారిని కాపలాగా వుంటాడు భర్త...

ఆఖరికి పిల్లలు పుట్టాక... పెరిగాక - అనుక్షణం తనకి కాపలాగా ఎవరో

ఒకళ్ళు ఉంటూనే వున్నారు. కానీ.. కానీ.. ఇప్పుడు తనకి కాపలా కావాలి – తను చచ్చిపోతుంది.

కొడుకులు – కోడళ్ళు దగ్గరలేకుండా అమ్మని చూడకుండా – పవిత్ర కళ్ళు మూతలు పడుతున్నాయి – ఏవేవో దృశ్యాలు చిన్నప్పటివి – యవ్వనంలోని – రకరకాలుగా – రంగులు రంగులుగా – కళ్ళముందు అస్పష్టంగా కదుల్తున్నాయి. పెదాలు కదలకుండా...

కళ్ళు మూసుకుపోతున్నాయి...

తను చచ్చిపోతుందా? .. తన వాళ్ళెవరూ దగ్గర లేకుండా చివరి సమయంలో తనకు ఎవరూ కాపలా లేకుండా ఎక్కడ్నించో లీలగా పాట -- ఎవరికి ఎవరు? కాపలా? పవిత్ర కళ్ళు పూర్తిగా... పూర్తిగా మూతబడుతున్నాయి. పెరట్లో వున్న బాదం చెట్టు మీంచి కాకి ఒకటి – రెక్కలు రప రప లాడించి – ఒక్కసారిగ ఎగిరిపోయింది.

విశాలాంధ్ర
తేది 1-3-98